# శిక్ష ఎప్పుడు?

—ఎం. వి. కమలాకరరావు

ఈ ముసలి తనంలో ఆ ఉప్పమ్ముకునే బ్రతుకు నీ కెందుకు తాతా? నాలా నువ్వుకూడా హాయిగా బ్రతకడం నేర్చుకో, అప్పుడే ఈ లోకం నిన్ను గౌరవిస్తుంది.... అన్నాడు గజదొంగ రంగడు.

దొంగ నీతులు వల్లిస్తున్నాడంటే ఆశ్చర్యం ఏమీలేదు.

రంగడూ... నువ్వెన్ని చెప్పు ఆ పాడుబ్రతుకు నేను బతకలేను... అన్నాడు తాత.

తాతా... ఇది పాడు బ్రతుకు అన్నవాళ్ళందరూ నా వెనకాల నన్ను మెచ్చుకుంటారు, ఎప్పుడూ తలుచుకుంటారు... నీదో? పాపం ఉప్పమ్ముకొనే తాత అనిజాలి తల్చయినా... కనికరించరు.

నన్ను మెచ్చుకోక పోయినా పర్వాలేదు... నీతి నిజాయితీగా బ్రతికే మనిషినని తెలుసుకుంటారు... అంతేచాలు కానీ దొంగతనం మాత్రంనేనుచచ్చినా చెయ్యను... అన్నాడు దృఢంగా

నీ మంచికోరే వాణ్ణిగనక చెప్తున్నా ఇక నీ ఇష్టం... అన్నాడు సిగరెట్టు వెలిగిస్తూ,

అంతో ఇంతో చదువుకుని చోర విద్యలో ప్రవేశించినవాడు కాబట్టి యాసగా మాట్లాడటం అతనికి రాదు. తాతా అంటేనేచాలు. తాతమనస్సులో కోటి వీణలు మ్రోగుతాయి.

తాతకి దగ్గర వాళ్ళు లేకపోవటం, రంగడిలో స్నేహాన్ని చూడగలిగింది.

మనిషికి జీవనమే ప్రధానమయితే, ముష్టెత్తుకునయినా బతకొచ్చు ఉప్పమ్ముకునయినా బతకొచ్చు కానీ దొంగగా బతికిన దానికంటె ఈ బ్రతుకుకే ఎక్కువ విలువ... మనిషిగా బ్రతికే వాడు నలుగురిలో తలెత్తుకు తిరగ్గలడు దొంగవాడు ఆఖరికి ప్రపంచంలో తలెత్తుకు తిరగాలన్నా... తిరగలేడు నాయనా... అంతే తేడా...

పో తాతా...! నీదో వేదాంతం డబ్బులేనివాడిని ఎవరూ గౌరవించరని నీకుమాత్రం తెలియదా?

నువ్వెన్ని చెప్పునాయనా... నేను నీలా జీవించలేను... నువ్వుకూడా అంతే... అన్నాడు తాత కుక్కిమంచంలో పడుకుంటూ.

రంగడిమనసు వికలమయింది.

ఏం. నేనూ తాతలాగా తిరగలేనా ప్రపంచం నన్ను గౌరవించటం లేదా? ఆ మాటలకి సమాధానాలు దొరకుట చాలా కష్టంగా వుంది.

ముసలితనం ఆ తాతని కబళించటానికి సిద్ధంగా ఉన్నా, జీవితంకోసం ఎందుకు తాపత్రయ పడుతున్నాడు?

సారాదుకాణం ముందునుంచి పోతున్నాడు-రంగడు.

తాతకి అలవాటులేని సారా తాగటం కూడా రంగడికి ఏదో తప్పిదంలా తోచింది.

ఏరా... రంగా? ప్రశ్నించాడు మీసాల నర్సయ్య. లేదు... మావా ఇవాళ తాగాలని లేదు... అన్నాడు రంగడు గుడిసె తలుపు తెరుచుకుని, కుక్కిమంచం బయటికి తెచ్చి. వేసుకున్నాడు అన్నంకూడా సయించటం లేదు, తల తిరిగిపోతుంది. మనస్సు చైతన్యవంతంగా పనిచేస్తోంది తలతిరిగి పోతుంది.... తాతమనస్సులోని భావం రంగడిని మరీ క్రుంగదీస్తోంది,

ఇవాళ చెయ్యాల్సిన దొంగతనం జ్ఞాపకం వచ్చింది. లేవబోయాడు, తాత అంటున్నమాటలు చెవుల్లో మ్రోగుతున్నాయి లేవలేకపోయాడు

రెడ్డిగారి ట్లో కొట్టేసిన వెయ్యి రూపాయలున్నాయి అవి చాలు రెండు నెలలు గడవటానికి?

మనస్సుని స్వాధీనపరచుకోలేక సతమతమయి పోతున్నాడు, ఇంతవరకు తను జైలుగోడలమధ్య నలగలేదు. తన చాకును చూసినవాడెల్లా డబ్బును కురిపించడమే కారణం

పోలీసుల దగ్గర తన ఫోటో శేషంగా మిగిలినా పట్టుకోలేక పోతున్నారు

రంగడికి తన బ్రతుకుమీద అసహ్యం వేసింది,

పోనీ ఇకనుంచి ఏదయినా ఒకమంచిపని చేయగలిగితే అంతేచాలనుకున్నాడు ఏం చెయ్యడమా అని ఆలోచించి చివరికి ఓ నిర్ణయానికి మాత్రం రాగలిగాడు. తను తాత కల్సి ఉంటేసరి

మంచివాడి సాంగత్యంలో చెడ్డవాడుకూడా మల్లెపువ్వులా మారతాడని చెప్పే విశ్వం మాష్టారు, జ్ఞాపకం వచ్చారు. రంగడి కళ్ళుచెమ్మగిల్లాయి.

రేపటినుంచి దొంగతనం చెయ్యకూడదనుకున్నాడు. ప్రతిజ్ఞలోని

(తరువాయి 16వ పుటలో)

# శిక్ష ఎప్పుడు

(4వ పుట నుండి)

ఆవేశం రంగడ్ని నిద్దర పుచ్చింది దొంగకూడా మంచి వాడుగా బ్రతుకు తాడని తెల్సుకున్న చంద్రుడు, మర్రి చెట్టునుంచి బయటకువచ్చి రంగడికి మరింత చల్లదనం కల్పించాడు.

★ ★ ★

రంగడి ఇంటి ప్రక్కనే ఉన్న మర్రి చెట్టు కొమ్మలను డి సూర్యుడి కిర ణాలు అతనికి బెస్ట్ విషెస్ పంపిస్తూ నిద్దర లేపాయి

రంగడు లేచి ముఖం కడుక్కొని చాయ్ కూడా త్రాగకుంటా తాతఇంటి వైపు పరిగెత్తాడు.

తాత ఇంటిచుట్టూ జనం ఇంత ప్రొద్దున్నే ఎందుకు మూగారో రంగ డికి అర్థం కాలేదు. పరుగున వెళ్ళి గుంపును ప్రక్కకుతోసుకుంటూ, లోప లికి దూరి నిశ్చేష్టుడయ్యాడా దృశ్యం చూసి.

ఎదురుగా తాతశవం నిర్మలంగా నవ్వుతోంది. రంగడు గుండె పగిలి పోయేటట్లు ఏడ్చాడు రాత్రంతా రక్తపు వాంతులతో తాతచాలా బాధ పడ్డాడని తెల్సి రంగడు కుమిలి పోయాడు

ఎవరూ అట్లా తాతమీదపడి ఏడవ లేదు.

పాపం, పోయాడు... అనిమాత్రం అనగలిగారు అతికష్టంమీద గజదొంగ రంగడు. ఎప్పుడూ ఏడవని రంగడు ఈ నాడు గుండె లవిసిపోయేలా ఏడు స్తున్నాడంటే విచిత్రంగా ఉంది లోకా నికి...

రంగడు చొక్కాని నోటికడ్డంగా పెట్టుకొని వెక్కిళ్ళుపెట్టిఏడుస్తున్నాడు భగవాన్ నాకు సహాయంచెయ్యటానికి కూడా వీలులేకుండా చేశావా...? అని రంగడి మనస్సు మూగగా రోధిస్తోంది.

తనదగ్గరున్న వెయ్యి రూపాయలు ఖర్చుపెట్టి, దహనసంస్కారాలుచేశాడు. ఎవరికీ ఏమికానితాత జీవితం రంగడి వల్ల ధన్యమయి పోయింది,

చితిలోని ప్రతి అగ్నికణం. రంగడి మనస్సుదహిస్తోంది. రంగడు శ్మశానం లోంచి కదలకుండా దగ్గర్లో రాతిమీద చతికిల బడ్డాడు.

వెనక భుజంమీద చేతులుపడినా, ఎవరో తెల్సుకోవాలని ఉబలాటం కూడా లేకపోయింది-రంగడికి నెమ్మ దిగా కళ్ళనీళ్ళు తుడుచుకుంటూ వెను దిరిగాడు.

మౌనంగా చేతికి బేడీలు వేయించు కున్నాడు.

రంగడి ప్రశాంత హృదయానికి తీవ్రఘాతం తగిలింది.

న్యాయం రంగడికి బేడీలు పడటం చూడలేక పోయింది.

రవి అస్తమిస్తున్నాడు.

# మానవు డెవరు?

—పార్నంది సరోజ

అన్యాయాలే
అదర్శంగా
అక్రమాలే
ఆచారంగా
పరుల దూషణయే
జీవిత ధ్యేయంగా
పరులనాశనమే
సఫలత్వంగా
దుష్కృత్యాలే
క్రమశిక్షణగా
దుర్భాషణలే
కర్తవ్యంగా
మెలగుతూ
ఈర్ష్యాసూయలు
మనసునినింపి
సౌజన్యమనే మేకతోలు
కప్పుకొన్నవాడా మానవుడు?
మరి మానవుడెవరు?

ఆశలు తీర్చుకొనే
ఆవేశంలో
విచక్షణా జ్ఞానానికి
స్వస్థి చెప్పి
ఆశయాలు త్రోసిపుచ్చి
మానవత్వం
మరచిపోయి
మమకారం
మంటగలిపి
మమత్వ దోషాన్ని
మూటగట్టుకొని
తోటి మానవుడనే
సద్భావనలేక
అతనికే కీడు
తలపెట్టేవాడా! మానవుడు?
మరి మానవుడెవరు?

కళ్ళలో కపటం
హృదయంలో ద్వేషం
మనసులో మాలిన్యం
కలిగిఉన్నా
మాటల్లో మంచితనం
చూపుల్లో కారుణ్యం
కనబరుస్తూ
అమాయక లోకాన్ని
మట్టచెప్పే వాడా మానవుడు!
మరి మానవుడెవరు?